సాక్షి
పార్వతీపురం మన్యం

బుధవారం । 12 । ఫిబ్రవరి । 2025



రథంపై రామయ్య..! - 8లో

సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలోని శ్రీ సీతారామస్వామి వారి దేవస్థానం రామ నామస్మరణతో మంగళవారం మార్మోగింది.



పోలీస్‌శాఖ ప్రతిష్టను పెంచాలి

పోలీస్ శాఖ ప్రతిష్టను పెంచేలా సిబ్బంది విధులు నిర్వర్తించాలని ఎస్పీ వకుల్ జిందల్ సూచించారు. - 8లో



చోరీని ఛేదించిన పోలీసులు

బొబ్బిలి పట్టణంలోని చిన్నబజారులో ఈ నెల ఒకటో తేదీన రాత్రి జరిగిన చోరీ కేసును పోలీసులు ఛేదించారు. - 8లో

న్యూస్‌రీల్

ప్రాథమిక రంగాలు మరింత వృద్ధి చెందాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

పార్వతీపురం: ప్రాథమిక రంగాలు మరింత వృద్ధి సాధించేలా అవగాహన కల్పించాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ సిబ్బందిని ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం ఆయన కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు, ఎస్‌హెచ్‌జీ గ్రూపులు, వ్యక్తిగత యూనిట్‌లు నెలకొల్పేలా ఔత్సాహికులకు అవగాహన కల్పించి దరఖాస్తు చేసుకునేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రాథమిక రంగాల వృద్ధిపై సమీక్షిస్తూ సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహించేలా రైతులకు అవగాహన కల్పించాలని చెప్పారు. ప్రతి మూడు నెలలకు సేంద్రీయ వ్యవసాయం చేసే రైతులకు అవార్డులను ప్రకటించి ప్రోత్సహించాలని కోరారు. ఉద్యాన పంటలు ఎక్కువగా సాగు చేసేలా రైతులను ప్రోత్సహించాలన్నారు. మత్స్యసంపద అభివృద్ధికి చర్యలు చేపట్టాలని, ప్రధానమంత్రి ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్ కింద జిల్లాలో కుటీర ఆహార పరిశ్రమల యూనిట్ల స్థాపనకు క్లస్టర్లను గుర్తించాలని తెలిపారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి కె.రాబర్ట్‌పాల్, ఉద్యాన వన శాఖాధికారి బి.శ్యామల, మత్స్యశాఖ అధికారి వి.తిరుపతయ్య, పట్టు పరిశ్రమ శాఖాధికారి ఏవీ సాల్మన్‌రాజు, పశుసంవర్ధకశాఖాధికారి ఎస్.మన్మథరావు, ఎల్‌డీఎం విజయస్వరూప్, డీఆర్‌డీఏ పీడీ వై.సత్యంనాయుడు, పీఎంఎఫ్‌ఈ జోనల్ మేనేజర్ శ్రీనివాస్‌తోపాటు పలువురు పాల్గొన్నారు.

విద్యార్థిని మృతి విచారకరం

గుమ్మలక్ష్మీపురం: కురుపాం మండలం లంకాజోడు ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థిని పువ్వల వాసవి మృతి పట్ల రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు మంగళవారం ఒక ప్రకటనలో విచారం వ్యక్తం చేశారు. ఆమె మృతికి గల కారణాలను కోరుతూ తనకు నివేదిక సమర్పించాలని సంబంధిత అధికారులను కోరారు. గిరిజన విద్యార్థుల ఆరోగ్యంపై అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తతే ప్రధానం



మాట్లాడుతున్న జిల్లా ఇన్‌ఫర్మేటిక్ అధికారి నరేంద్ర

విజయనగరం అర్బన్: ఆన్‌లైన్ సేవలపై అప్రమత్తతే ప్రధానమని జిల్లా ఇన్‌ఫర్మేటిక్ అధికారి ఆర్.నరేంద్ర అన్నారు. ఎలక్ట్రానిక్స్ ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వశాఖ పరిధిలోని జాతీయ సూచన విజ్ఞాన కేంద్రం (ఎన్‌ఐసీ) ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయ ఆడిటోరియంలో మంగళవారం 'సురక్షిత ఇంటర్నెట్ దినోత్సవం' ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు, ప్రభుత్వ ఉద్యోగులకు అంతర్జాల సేవలు సురక్షితంగా ఎలా వినియోగించాలనే అంశంపై అవగాహన కల్పించారు. డిజిటల్ గుర్తింపు, వ్యక్తిగత సమాచారాన్ని అనధికారిక వెబ్‌సైట్లలో షేర్ చేయరాదని, వన్‌టైమ్ పాస్‌వర్డ్ సమాచారాన్ని ఇతరులతో పంచుకోరాదని చెప్పారు. కార్యక్రమంలో సీపీఓ పి.బాలాజీ, జిల్లా వ్యవసాయ అధికారి వి.టి.రామారావు, అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీకాంత్, ఇన్‌ఫర్మేటిక్ అధికారి ఎ.బాలసుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

వ్యాధుల నియంత్రణకు సహకరిస్తాం



డీఎంహెచ్‌ఓను సత్కరిస్తున్న ఐఎంఏ ప్రతినిధులు

విజయనగరం ఫోర్ట్: వ్యాధుల నియంత్రణకు తమ వంతు సహకారం అందజేస్తామని ఐఎంఏ ప్రతినిధులు తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి (డీఎంహెచ్‌ఓ) డాక్టర్ జీవనరాణిను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలో వ్యాధుల వ్యాప్తిపై చర్చించారు. డీఎంహెచ్‌ఓను కలిసిన వారిలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) మాజీ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.జయచంద్రనాయుడు, జిల్లా అధ్యక్షుడు అశోక్, కార్యదర్శి శ్రీనివాస్ ఉన్నారు.

మందుబాబులకు ధరల బాదుడు

- ప్రభుత్వ ఆదేశాలు రాక ముందే ధరలు పెంచేసిన మద్యం వ్యాపారులు
- క్వార్టర్ బాటిల్‌పై రూ.10 నుంచి రూ.20 వరకూ పెంచేసిన కూటమి సర్కారు



ఉమ్మడి విజయనగరం జిల్లాలో మద్యం దుకాణాలు

ఒక్కో షాపులో రోజుకు సగటున సాగే వ్యాపారం రూ.3 లక్షలు

ఉమ్మడి జిల్లాలో రోజుకు మద్యం వ్యాపారం రూ.6.15 కోట్లు

తాజా పెంపుతో రోజుకు మందుబాబుల నుంచి అదనపు దోపిడీ రూ.50 లక్షలు

సాక్షి ప్రతినిధి, విజయనగరం:

కూటమి సర్కారు వస్తే నాణ్యమైన మద్యంతో పాటు మద్యం ధరలను వెంటనే తగ్గిస్తామని కూటమి నాయకులు చెప్పిన మాటలు అన్నీ పచ్చి అబద్ధాలని ఏడు నెలలకే తేలిపోయింది. క్వార్టర్ బాటిల్‌పై రూ.10 పెంచుతున్నట్లు సోమవారం ప్రకటన వచ్చింది. ఇందుకు సంబంధించి అధికారిక ఉత్తర్వులు రాకముందే మద్యం వ్యాపారులు మంగళవారం ధరలు పెంచేశారు. కూటమి సర్కారు క్వార్టర్ బాటిల్‌పై రూ.10 పెంచుతున్నట్లు ప్రకటన చేస్తే మద్యం వ్యాపారులు ఏకంగా బాటిల్‌పై రూ.20 వరకు పెంచేశారు. అక్రమ వ్యాపారానికి తెరతీశారు. బాబు మార్క్ పథకంతో మందుబాబుల జేబులకు కన్నం పెడుతున్నారు. సిండికేట్ ఉమ్మడి విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో నిస్సిగ్గుగా దోపిడీ చేస్తున్నారు. ఇక మద్యం ధరలు పెంచుకోవచ్చునని ఆదేశాలు వస్తే ఇంకా మద్యం ధరలు పెంచేందుకు సిండికేట్ సిద్ధమవుతున్నారు.

● రోజుకు రూ.50 లక్షల వరకు దోపిడీ...

విజయనగరం జిల్లాలో 153 ప్రైవేటు మద్యం దుకాణాలు, పార్వతీపురం మన్యం జిల్లాలో 52 మద్యం దుకాణాలతో కలిపి మొత్తం ఉమ్మడి జిల్లాలో 205 ఉన్నాయి. వీటిలో ఒక్కో షాపులో రోజుకు సరాసరిన రూ.3 లక్షల వ్యాపారం చొప్పున ఉభయ జిల్లాల్లో రోజుకు సుమారు రూ.6.15 కోట్ల మేర మద్యం వ్యాపారం జరుగుతోంది. ఇదిలా ఉండగా ప్రతీ షాపులో మద్యం ధర పెంచేస్తున్నారు. బాటిల్‌పై రూ.10 నుంచి రూ.20 వరకూ పెంచి విక్రయిస్తున్నారు. తద్వారా మద్యం సిండికేట్‌లు రోజుకు రూ.50 లక్షల వరకు మందుబాబులను నిలువు దోపిడీ చేస్తున్నారు.

● ఊరూరా బెల్టు దందా....

వేసవి కాలం సమీపిస్తుండడంతో పల్లెల్లో దాహం కేకలు సర్వసాధారణం. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత మంచినీటి మాట పక్కన పెడితే మందు దొరకని గ్రామం లేదు. ప్రతీ గ్రామంలో మద్యం వ్యాపారులు విచ్చలవిడిగా బెల్టు షాపుల నిర్వహిస్తున్నారు. గత టీడీపీ ప్రభుత్వ పాలనలో బెల్టు షాపులు నిర్వహించేవారు వైన్ షాపు వద్దకే వచ్చి మద్యం బాటిళ్లను తీసుకువెళ్లేవారు. ఇప్పుడు ట్రెండ్ మారింది. మద్యం వ్యాపారులే ప్రత్యేక వాహనంలో ఊరూరా మద్యం బాటిళ్లను బెల్టుషాపులకు తరలిస్తున్నారు. ఈ షాపుల నిర్వాహకులు ఎక్కువ మంది కూటమి నాయకులే కావడం గమనార్హం.

> **కూటమి ప్రభుత్వం పచ్చి దగా...**
>
> తమ ప్రభుత్వం వస్తే మద్యం ధరలు తగ్గిస్తామని హామీలు ఇచ్చిన కూటమి నాయకులు తమ పాలన ఏడాది గడవక ముందే మద్యం ధరలు పెంచేందుకు పచ్చ జెండా ఊపారు. సిండికేట్లు ఇచ్చే కమీషన్ కోసం మద్యం ధరలు పెంచడం దారుణం. ఇంకా మద్యం అమ్మకాలు పెంచుతున్నట్లు ఉత్తర్వులు రాకముందే సిండికేట్లు సోమవారం నుంచే మందు ధరలు పెంచేయడం వారి ధన దాహానికి అద్దం పడుతోంది.
>
> – అలజంగి జోగారావు, మాజీ ఎమ్మెల్యే, పార్వతీపురం

> **పేదోడి కష్టాన్ని దోచుకుంటున్నారు...**
>
> పేదల రోజువారీ సంపాదన తాగుడుకు తగలేస్తూ ఖాళీ జేబులతో ఇంటికి వస్తే కుటుంబం గడవడం సాధ్యం కాదు. ఈ విషయం తన సుదీర్ఘ పాదయాత్ర సమయంలో వైఎస్సార్‌సీపీ అధినేత వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి గుర్తించారు. అధికారంలోకి వచ్చిన తొలి మాసంలోనే బెల్టు షాపులను ఏరిపారేశారు. అక్కచెల్లెమ్మల కళ్లల్లో ఆనందం చూశారు. ఈ విధానం కొనసాగిస్తే ప్రభుత్వానికి వేల కోట్ల రూపాయల ఆదాయం వస్తుందని తెలిసినా సమాజంలో మార్పు కోసం మద్యం అక్రమ రవాణాను, బెల్టు షాపులను నిర్మూలించారు. దీనిపై కూటమి నేతలు విష ప్రచారం చేశారు. తక్కువ ధరకే నాణ్యమైన మందు ఇప్పిస్తామని నమ్మించారు. మద్యం ప్రియుల ఓట్లు దండుకునేలా పన్నాగం పన్నారు. తీరా అధికారం చేజిక్కించుకున్న వెంటనే మద్యం ధరలు పెంచేసి ముఖ్యంగా పేద కుటుంబాలను నిలువునా మోసగించారు.
>
> – విశ్వాసరాయి కళావతి, మాజీ ఎమ్మెల్యే, పాలకొండ

సిరిమాను చెట్టుకు ప్రత్యేక పూజలు



సాలూరు పట్టణంలో 14 ఏళ్ల తర్వాత ఈ ఏడాది మే నెలలో శ్యామలాంబ అమ్మవారి సిరిమానోత్సవం నిర్వహణకు భక్తులు సన్నద్ధమవుతున్నారు. ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చకచకా సాగుతున్నాయి. ఆర్‌సీఎం పాఠశాల సమీపంలో గుర్తించిన సిరిమాను చెట్టుకు భక్తులు మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. పసుపు కుంకుమలతో బొట్లు పెట్టారు. సిరిమాను చెట్టును సేకరించి ఉత్సవం రోజుకు సిరిమాను రథాన్ని తయారు చేస్తామని నిర్వాహకులు తెలిపారు.

– సాలూరు

అందరి నామినేషన్లు ఆమోదం

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలో భాగంగా అభ్యర్థుల నామినేషన్ పత్రాల పరిశీలన
- 20కి గానూ 16 సెట్లను ఆమోదించిన ఆర్వో



అభ్యర్థుల సమక్షంలో నామినేషన్లు పరిశీలిస్తు న్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్, ఎన్నికల పరిశీలకుడు ఎం.ఎం.నాయక్

మహారాణిపేట: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గ స్థానానికి జరుగుతున్న ఎన్నికల బరిలోకి దిగిన అభ్యర్థులందరి నామినేషన్ పత్రాలు ఆమోదం పొందాయి. ఎన్నికల పరిశీలకుడు ఎం.ఎం.నాయక్ ఆధ్వర్యంలో, అభ్యర్థుల సమక్షంలో రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నామినేషన్ పత్రాల పరిశీలన చేపట్టారు. ఒక్కో అభ్యర్థి పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అభ్యర్థులు సమర్పించిన పత్రాల వివరాలను మిగిలిన వారికి తెలిసేలా చదివి వినిపించారు. కాగా.. ఈ నెల 3 నుంచి 10వ తేదీ వరకు జరిగిన నామినేషన్ల ప్రక్రియలో మొత్తం 10 మంది అభ్యర్థులు 20 సెట్లను సమర్పించారు. ఇందులో నాలుగు సెట్లు సరిగ్గా లేకపోవడంతో ఆర్వో తిరస్కరించారు. సత్తలూరి శ్రీరంగ పద్మావతి, పెదపెంకి శివప్రసాద్, సుంకర శ్రీనివాసరావు, పోతల దుర్గారావు రెండేసి సెట్లు వేయగా వాటిల్లో ఒక్కొక్కటి తిరస్కరణకు గురయ్యాయి. అయితే అభ్యర్థులు ప్రత్యామ్నాయ సెట్లు సమర్పించడంతో, వాటిలో సరైన వాటిని పరిగణలోకి తీసుకొని ఆమోదించారు. పాకలపాటి రఘువర్మ, గాదె శ్రీనివాసులు నాయుడు, కోరెడ్ల విజయగౌరి మూడేసి సెట్లు వేయగా అన్నీ అర్హత సాధించాయి.కోసూరు రాధాకృష్ణ, నూకల సూర్యప్రకాష్, రాయల సత్యనారాయణ ఒక్కో సెట్ వేయగా ఆమోదం పొందాయి. ప్రమాణాలకు అనుగుణంగా అందరి పత్రాలు ఉండటంతో 10 మంది అభ్యర్థుల నామినేషన్లను ఆమోదిస్తూ రిటర్నింగ్ అధికారి నిర్ణయం వెలువరించారు.

స్వల్పంగా పెరిగిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్లు

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్ల సంఖ్య స్వల్పంగా పెరిగింది. తొలి విడత జాబితా ప్రకారం 21,555 మంది ఓటర్లు ఉండగా.. ఈనెల 10వ తేదీ వరకు వచ్చిన ఓటర్ల నమోదు దరఖాస్తులను పరిశీలించారు. వీటిని పరిశీలన అనంతరం కొత్తగా 938 మంది ఓటర్లు పెరిగారు. తుది ఓటర్ల జాబితా ప్రకారం 22,493 మంది ఓటర్లు ఉన్నారు. అలాగే మొత్తం 123 పోలింగ్ స్టేషన్లు ఖరారు చేశారు.

జిల్లా	పురుషులు	మహిళలు	ఇతరులు	ఓటర్లు	పోలింగ్ స్టేషన్లు
శ్రీకాకుళం	3,416	1,619	00	5,035	31
విజయనగరం	3,270	1,953	00	5,223	29
మన్యం పార్వతీపురం	1,574	759	00	2,333	15
అల్లూరి సీతారామరాజు	920	568	00	1,488	11
విశాఖపట్నం	2,539	2,990	00	5.529	13
అనకాపల్లి	1,789	1,096	00	2,885	24
మొత్తం	13,508	8,985	00	22,493	123

ఆంధ్ర ఎస్ఐ తీరును ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్లండి

- మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొరకు విన్నవించిన మెంటాడ ప్రజాప్రతినిధులు, నాయకులు



ఆంధ్ర ఎస్ఐ తీరును ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్లాలని మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొరకు వినతిపత్రం అందజేస్తున్న మెంటాడ నాయకులు

సాలూరు: ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తూ టీడీపీ నాయకుల సేవలో తరిస్తున్న ఆంధ్ర ఎస్ఐ తీరును ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్లాలని మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొరను మెంటాడ మండల ఎంపీపీ సన్యాసి అప్పలనాయుడు, వైస్ ఎంపీపీ ఈశ్వరరావు, నాయకులు లెంక రత్నాకర్ కోరారు. రాజన్నదొరను సాలూరు పట్టణంలో ఆయన స్వగృహంలో మంగళవారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనవరి 29 నుంచి ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉండగా ఫిబ్రవరి 1వ తేదీన సాయంత్రం 5 గంటలకు ఆంధ్ర ఎస్ఐ ప్రభుత్వ వాహనంలో టీడీపీ నాయకులను ఎక్కించుకుని మంత్రి సంధ్యారాణి ఇంటికి తీసుకెళ్లారన్నారు. ఆ ఫొటోలు, వీడియోలు ఎన్నికల నోడల్ అధికారి, జెడ్పీ సీఈఓకు అందజేశామన్నారు. దీనిపై మెంటాడ ఎంపీడీఓ, తహసీల్దార్లను విచారణ అధికారులుగా నియమించారని, వారు విచారణ జరిపారన్నారు. నేటికీ విచారణ అంశాలను తెలియజేయలేదన్నారు. జి.టి.పేటకు చెందిన ఓ కుటుంబంను జనవరి 30న ఆంధ్ర ఎస్ఐ స్టేషన్‌కు పిలిపించి ఆ ఇంటి కోడలను కొట్టిన విషయంపై జనవరి 31న సీఐకు ఫిర్యాదుచేశామన్నారు. మహిళను కొట్టడం ఓ తప్పు కాగా, మహిళను పురుషుడు కొట్టడం రెండవ తప్పన్నారు. ఈ విషయాన్ని రాష్ట్ర అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. దీనిపై రాజన్నదొర స్పందిస్తూ ఆంధ్ర ఎస్ఐ తీరును ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్తానన్నారు.

ఆత్మపరిశీలన చేసుకోండి

సాలూరు నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు శ్రమించిన మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొరపై విమర్శలు చేస్తున్న టీడీపీ నాయకులు ఒక్కసారి ఆత్మపరిశీలన చేసుకోవాలని మెంటాడ ఎంపీపీ, వైస్ ఎంపీపీ సన్యాసప్పలనాయుడు, ఈశ్వరరావు కోరారు. నాలుగుసార్లు ఎమ్మెల్యేగా పనిచేసిన రాజన్నదొర ఏ నాడూ నాయకులపై వ్యక్తిగత విమర్శలు చేయలేదన్నారు. రాజన్నదొర మెంటాడ మండలానికి చేసిన అభివృద్ధి ఏమిటో ప్రజలను అడిగితే చెబుతారన్నారు.

తహసీల్దార్ భార్యకు డీటీ పోస్టు

సాక్షి, అమరావతి: విశాఖపట్నంలో గత సంవత్సరం హత్యకు గురైన తహసీల్దార్ రమణయ్య సతీమణి అనూషకు కారుణ్య నియామకం కింద డిప్యూటీ తహసీల్దార్ పోస్టు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. విజయనగరం జిల్లా బొండపల్లి తహసీల్దార్ రమణయ్యను గత ఏడాది ఫిబ్రవరి 2వ తేదీన విశాఖపట్నంలోని ఆయన నివాసం వద్ద ఒక వ్యక్తి దారుణంగా హత్య చేశాడు. ఆయనపై ఆధారపడి తల్లితండ్రులు, ఇద్దరు పిల్లలు ఉండడంతో ఆయన కుటుంబంలో కారుణ్య నియామకానికి అర్హత ఉన్న రమణయ్య భార్యకు డిప్యూటీ తహసీల్దార్ పోస్టు ఇవ్వాలని విజయనగరం జిల్లా కలెక్టర్ సిఫారసు చేశారు. రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ కూడా దీనిపై విజ్ఞప్తి చేయడంతో మానవీయ దకృథంతో నిబంధనలు సవరించి రమణయ్య భార్య పాలాకి అనూషను ప్రొబేషనరీ డిప్యూటీ తహసీల్దార్ పోస్టులో నియమిస్తున్నట్లు రెవెన్యూ శాఖ ఉత్తర్వులిచ్చింది.

గ్రంథాలయాలకు బకాయిల గుదిబండ

- స్థానిక సంస్థల నుంచి రావాల్సిన సెస్సు బకాయిలు రూ.4 కోట్లు



గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బోని లక్ష్మి

బొబ్బిలి: జిల్లాలోని గ్రంథాలయాల అభివృద్ధికి బకాయిలు అవరోధంగా మారాయని, స్థానిక సంస్థల నుంచి రూ.4 కోట్ల మేర సెస్సు వసూలు కావాల్సి ఉందని ఆ సంస్థ కార్యదర్శి (ఎఫ్‌ఏసీ) బోని లక్ష్మి అన్నారు. బొబ్బిలి శాఖ గ్రంథాలయాన్ని ఆమె మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ కేవలం బొబ్బిలి మున్సిపాలిటీ మాత్రమే ఎప్పటికప్పుడు సెస్సు చెల్లిస్తోందన్నారు. మిగిలిన మున్సిపాలిటీలు, పంచాయతీలు, ఇతర సంస్థలేవీ గ్రంథాలయాలకు బకాయిలు చెల్లించకపోవడంతో గ్రంథాలయ భవనాల అభివృద్ధికి ఆటంకం కలుగుతోందన్నారు. కొన్ని భవనాలు కూలిపోయే దశలో ఉన్నా బాగుచేయలేకపోతున్నామని వాపోయారు. ఉమ్మడి విజయనగరం జిల్లాలోని సాలూరు మున్సిపాలిటీ రూ.44లక్షలు, పార్వతీపురం రూ.10లక్షలు, నెల్లిమర్ల రూ.39 లక్షల మేర బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. మొత్తం 41 శాఖా గ్రంథాలయాల్లో 9 అద్దెభవనాల్లోను, 25 సొంత భవనాల్లోను, మరో 7 ఉచిత వసతి కల్పన కింద నడుస్తున్నాయన్నారు. నాలుగు గ్రంథాలయాలు ఇన్‌చార్జిలతో కొనసాగుతున్నట్టు వెల్లడించారు. జిల్లాలోని కంప్యూటర్ పరిజ్ఞానమున్న పది మంది లైబ్రేరియన్లతో గ్రంథాలయాల డిజిటలైజేషన్ జరుగుతోందన్నారు. జిల్లా కేంద్రంలోని 52వేల పుస్తకాలు డిజిటలైజేషన్ పూర్తయిందని చెప్పారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు రోజంతా గ్రంథాలయాలు వినియోగించుకునేలా నిర్ణీత వేళల నుంచి మినహాయింపు ఇచ్చామన్నారు.

పేదల గూడుపై అనర్హత వేటు!

- అనర్హులు ఇళ్ల స్థలాలు పొందారంటూ ఆరోపణ
- అనర్హత జాబితాలు సిద్ధం చేసిన ప్రభుత్వం
- సమగ్ర విచారణకు కలెక్టర్లకు ఆదేశం
- రెవెన్యూ సిబ్బందితో విచారణకు యాప్‌లు సిద్ధం
- అక్రమాలని తేలితే పట్టాల రద్దుకు చర్యలు
- బెంబేలెత్తిపోతున్న లబ్ధిదారులు
- జిల్లాలో 27,142 మందికి ఇళ్ల పట్టాల పంపిణీ చేసిన గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం



గోపాలపురంలోని వైఎస్సార్ జగనన్న కాలనీ

పార్వతీపురంటౌన్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అన్నింటా కోతలే కనిపిస్తున్నాయి. ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల అమలు ఊసేలేదు. గత జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అందజేసిన సంక్షేమ పథకాలను అటకెక్కించింది. అప్పట్లో పేదలకు మంజూరు చేసిన ఇళ్ల స్థలాలపై ఇప్పుడు అనుమానపు చూపులతో సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. పేదల గూడుకు అనర్హత వేటు వేసేందుకు సన్నద్ధం కావడంపై లబ్ధిదారులు గోడువెళ్లబోస్తున్నారు.

ఇదీ పరిస్థితి...

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నవరత్నాలు పథకాలలో భాగంగా పేదలందరికీ ఇళ్లు కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టింది. ఐదేళ్లలో జిల్లాలోని 27,142 మంది పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించింది. పాలకొండ, పార్వతీపురం, సాలూరు మున్సిపాలిటీలో సైతం అధికమంది లబ్ధిదారులకు జగనన్న కాలనీల్లో స్థలాలు పొందారు. 13,196 ఇళ్ల నిర్మాణాలు పూర్తి కాగా 11,079 నిర్మాణాలు స్లాబ్ స్థాయిలో ఉన్నాయి. మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి. గత ప్రభుత్వం ఇళ్ల నిర్మాణాలు చేపట్టిన లబ్ధిదారులకు రూ.289 కోట్లకు పైగా బిల్లులు చెల్లించింది. సిమెంట్, ఇసుక, ఐరన్‌ను రాయితీపై సమకూర్చింది. అయితే, ప్రస్తుత కూటమి ప్రభుత్వం జిల్లాలోని ఇళ్ల పట్టాలు అందుకున్న లబ్ధిదారుల్లో సుమారు 40 శాతం అనర్హులు ఉన్నట్లు ఆరోపిస్తోంది. విచారణ జరిపి అనర్హుల ఇళ్ల స్థలాలు రద్దుచేయాలంటూ ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో లబ్ధిదారుల్లో ఆందోళన నెలకొంది. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం 10వ తేదీ నుంచి 15 రోజుల పాటు క్షేత్రస్థాయిలో పర్యటించి వివరాలు సేకరించాలి. ఈ విచారణ కోసం ప్రతి మండలంలోనూ మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, సర్వేయర్, వీఆర్‌ఓలతో కూడిన కమిటీని ఏర్పాటు చేయనున్నారు. విచారణలో తేలిన అనర్హుల ఇంటి పట్టాలను కలెక్టర్ రద్దు చేస్తారు.

యాప్ సిద్ధం.. విచారణకు రెవెన్యూ సిబ్బంది

ప్రతి పట్టణం, మండలంలోని జగనన్న కాలనీల్లో ఇంటి పట్టాలలో అనర్హుల పేరిట లబ్ధిదారుల సంఖ్యను తొలగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఒక మొబైల్ యాప్‌ను సిద్ధం చేసింది. మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, సర్వేయర్, వీఆర్వోలతో కూడిన విచారణ బృందం సేకరించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు ఈ యాప్‌లో ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేస్తుంది. పట్టాలను పొందేందుకు తమకు అన్ని అర్హతలూ ఉన్నాయని, లబ్ధిదారులే నిరూపించుకోవాలి. లేకుంటే అనర్హులుగా గుర్తించి ఇంటి పట్టాలను రద్దు చేస్తారు.

విచారణలో పరిశీలించే పత్రాలు

- తెలుపు రేషన్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం
- ఇళ్లపట్టాలు పొందిన వారికి అంతకు ముందే ఇల్లు, స్థలం ఉండకూడదు.
- ఇన్‌కంట్యాక్స్ చెల్లిస్తుంటే ఇంటి పట్టా రద్దవుతుంది.
- కారు, నాలుగు చక్రాల వాహనం ఉంటే ఇళ్ల స్థలం రద్దు చేస్తారు.
- కుటుంబంలో ఒకరి కంటే ఎక్కువ మందికి పట్టాలు ఉన్నా.. ఒకరికి మాత్రమే ఉంచి.. మిగతా వాటిని రద్దు చేస్తారు. (మ్యారేజ్ సర్టిఫికెట్ ఉంటే..అందరికీ వర్తిస్తుంది.)
- ప్రభుత్వం ఇచ్చిన స్థలాన్ని అమ్మితే వాటిని రద్దు చేసి ఆ స్థలాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకుంటుంది.
- లబ్ధిదారులు ఇచ్చే వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి ఆ తర్వాత పట్టాలు రద్దు చేసి నోటీసులు అందజేస్తారు.

> **పట్టాల రద్దు చేయాలన్నదే ప్రభుత్వ ధ్యేయం**
>
> గత ప్రభుత్వం పేదల సొంతింటి కలను నెరవేరుస్తూ జగనన్న కాలనీలో ఇంటి స్థలం మంజూరు చేసింది. నిర్మాణానికి ఆర్థిక సాయం అందజేసింది. పేదలకు పక్కా ఇంటి భాగ్యం కల్పించింది. నిర్మాణాలు పూర్తి కావస్తున్న సమయానికి విచారణ పేరుతో తొలగించేందుకు కూటమి ప్రభుత్వం కుట్రపన్నడం విచారకరం. అన్ని అర్హతలు పరిశీలించాకే అధికారులు ఇంటి స్థలం మంజూరు చేశారు. ఇప్పుడు మళ్లీ విచారణ జరపడం విచారకరం.
>
> – కె.వెంకటలక్ష్మి, లబ్ధిదారు, పార్వతీపురం

> **అర్హులకే స్థలాల మంజూరు**
>
> పార్వతీపురం పరిధిలో కేవలం అర్హులకు మాత్రమే పట్టాలను అందజేశాం. పారదర్శకంగా ప్రక్రియ చేపట్టి పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు గత ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో అనర్హత పేరిట విచారణ చేపట్టి పట్టాలు రద్దుచేసేందుకు చర్యలు చేపట్టడం తగదు. ఇది ప్రజా వ్యతిరేక చర్యగా భావిస్తున్నాం. నిజంగా అనర్హులు ఉంటే రద్దు చేయండి. అర్హులను అనర్హులుగా చిత్రించి రద్దు చేయవద్దు.
>
> – బోను గౌరీశ్వరి, మున్సిపల్ వైస్‌చైర్మన్, పార్వతీపురం

క్లుప్తంగా

బెల్టుషాపులపై ఎక్సైజ్ అధికారుల దాడులు



స్వాధీనం చేసుకున్న మద్యం బాటిల్స్‌ను చూపిస్తున్న సీఐ తదితరులు

రాజాం సిటీ: రాజాం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో అక్రమంగా నిర్వహిస్తున్న బెల్టుషాపులపై దాడులు నిర్వహించామని ఎక్సైజ్ సీఐ ఆర్.జై భీమ్ మంగళవారం తెలిపారు. ఈ దాడుల్లో నలుగురు వ్యక్తులు పట్టుబడగా కేసులు నమోదుచేశామని చెప్పారు. వారిలో రాజాం మండలానికి చెందిన ఎం.మురళి, జి.రాణి, సంతకవిటి మండలానికి చెందిన కె.హేమశంకరరావు, వంగర మండలానికి చెందిన జి.శ్రీనులను అదుపులోకి తీసుకుని వారి నుంచి 52 మద్యంబాటిల్స్ స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గ్రామాల్లో అక్రమంగా మద్యం అమ్మినా, బెల్టుషాపులు నిర్వహించినా అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో బెల్టుషాపులు నిర్వహించిన వారి వివరాలు తెలియజేయాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని వెల్లడించారు. కార్యక్రమంలో ఎస్సై మాన్యాలు, సిబ్బంది పాల్గొన్నారు.

స్క్రాప్ దుకాణంలో అగ్ని ప్రమాదం



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

పాలకొండ రూరల్: మండలంలోని నవగాం కూడలిలో పోతేన శంకరరావుకు చెందిన లక్ష్మీ ట్రేడర్స్ (స్క్రాప్) దుకాణంలో మంగళవారం అగ్నిప్రమాదం సంభవించింది. సమీపంలో పాత కాగితాలు, అట్టలు దగ్ధం చేస్తున్న క్రమంలో ఈ ప్రమాదం సంభవించింది. ఈ క్రయంలో దుకాణంలో ఉన్న వ్యర్థాలు, స్క్రాప్ మెటీరియల్‌కు మంటలు వ్యాపించడం, దట్టమైన పొగ కమ్ముకోవడంతో అక్కడి వారు భయభ్రాంతులకు గురయ్యారు. ఈ విషయం తెలుసుకున్న పాలకొండ అగ్నిమాపక అధికారి జామి సర్వేశ్వరరావు, సిబ్బంది, శకటంతో సహా ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపుచేశారు. బాధితుడి నుంచి సేకరించిన సమాచారంతో నష్టం అంచనా వేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో పెదతాడివాడ విద్యార్థిని ప్రతిభ



విద్యార్థిని తిప్పాన విద్యశ్రీకి ప్రశంసాపత్రాన్ని అందించి అభినందిస్తున్న డీఈవో మాణిక్యం నాయుడు తదితరులు

డెంకాడ: ఎడ్యుకేషన్ ఎఫిషియన్సీ మెరిట్ టెస్ట్(ఈఈఎంటీ–2025)లో పెదతాడివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని తిప్పాన విద్యశ్రీ ప్రతిభ కనబరిచింది. రాష్ట్ర స్థాయిలో జరిగిన ఆన్‌లైన్ పోటీలో పెదతాడివాడ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న తిప్పాన విద్యశ్రీ జిల్లా స్థాయిలో ప్రథమ ర్యాంకును సాధించింది. దీంతో ఇటీవల అమరావతిలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థిని తిప్పాన విద్యశ్రీకి స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ వి.విజయరామరాజు చేతుల మీదుగా ప్రశంసాపత్రంతో పాటు రూ.5వేల నగదు బహుమతిని అందజేశారు. అలాగే జిల్లా విద్యాశాఖాధికారి యు.మాణిక్యంనాయుడు, ఉప విద్యాశాఖాధికారి కేవీ రమణ, ఈఈఎంటీ జిల్లా కో ఆర్డినేటర్ వి.రాజేష్‌లు ఆమెను అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వీవీఏ నరసింగరావు, ఉపాధ్యాయిని జి.పద్మావతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రథంపై రామయ్య..!

- రామతీర్థంలో వైభవంగా సాగిన రథయాత్ర
- స్వామిసన్నిధిలో ఆకట్టుకున్న పండిత పరిషత్
- కనులారా తిలకించిన భక్తజనం



జై శ్రీరామ్ అంటూ రామస్వామి ఆసీనులైన రథాన్ని లాగుతున్న భక్తులు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలోని శ్రీ సీతారామస్వామి వారి దేవస్థానం రామనామస్మరణతో మంగళవారం మార్మోగింది. ప్రతి ఏటా స్వామివారి తిరుక్కల్యాణం అనంతరం మూడోరోజు నిర్వహిస్తున్న స్వామివారి రథయాత్రను కనులారా వీక్షించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమంలో భాగంగా అర్చకులు స్వామివారికి ఉదయం గ్రామబలిహరణం చేపట్టి శ్రీరాముడి సన్నిధిలో శ్రీమద్రామాయణ పారాయణ, వేదపఠనం, వైదిక సదస్యం తదితర కార్యక్రమాలను జరిపించారు. వేద పండితులంతా సాయంత్రం పండిత పరిషత్‌ను నిర్వహించి నాలుగువేదాలను భక్తిశ్రద్ధలతో పఠించారు. స్వామివారి విశేషాన్ని వివరిస్తూ మంగళ వాయిద్యాల నడుమ ఉత్సవ విగ్రహాలను ఆలయం చుట్టూ ఊరేగించారు. అనంతరం స్వామివారిని ప్రత్యేక మంటపంలో వేంచేపుచేసి పూజలు నిర్వహించారు. ప్రత్యేక పూజలనంతరం విగ్రహాలను పవిత్ర రథంపై ఆసీనులను చేసి రథయాత్రకు సిద్ధం చేశారు.

ఊరేగిన రాములోరు

వేద పండితుల వేదమంత్రోచ్చారణ, భక్తుల జయజయధ్వానాల నడుమ సీతారామ లక్ష్మణులు రామతీర్థం పురవీధుల్లో ఊరేగి వేలాది మంది భక్తులకు కనువిందు చేశారు. ఉత్తర రాజగోపురం సమీపంలోని ప్రధాన రహదారి నుంచి కుమ్మరి కానా మీదుగా ఆలయం వరకు జరిగిన ఈ రథయాత్రతో రామతీర్థం పులకించింది. ఆలయ ప్రతిష్ఠ జరిగిన నాటి నుంచి ఆనవాయతీగా వస్తున్న సీతారామునిపేట, జగ్గరాజుపేట, గొర్లిపేట గ్రామాలకు చెందిన భక్తులు ఈసారి కూడా రథాన్ని లాగి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉత్సవ విగ్రహాల ఊరేగింపునకు ముందు స్వామివారి సన్నిధిలో నిర్వహించిన పండిత పరిషత్ ఎంతో వైభవంగా జరిగింది. ఈ పరిషత్‌లో సీతారాముల గుణగణాలను తెలియపర్చడానికి వేదపండితులు పోటీపడిన సన్నివేశం భక్తులను ఆకట్టుకుంది. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న వేద పండితులను దేవస్థానం తరఫున ఘనంగా సన్మానించారు.

పోటెత్తిన భక్తులు

స్వామివారి కల్యాణోత్సవంలో భాగంగా నిర్వహించిన రథయాత్రకు జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ముఖ్యంగా విజయనగరం, నెల్లిమర్ల ప్రాంతాలతో పాటు ఏటీ అగ్రహారం, దన్నానపేట, తంగుడుబిల్లి, గొర్లిపేట, కొత్తపేట, సతివాడ, రామతీర్థం, ఒమ్మి, తదితర చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు కుటుంబ సమేతంగా వచ్చి రథయాత్ర మహోత్సవాన్ని కనులారా తిలకించారు. పూజా సామగ్రిని రథం పైకి విసిరి స్వామివారిని దర్శించుకున్నారు. రథయాత్రలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు. దేవస్థానం ఈఓ వై.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అర్చకులు సాయిరామాచార్యులు, నరసింహాచార్యులు, వరప్రసాద్, కిరణ్, పవన్‌కుమార్ తదితరులు కార్యక్రమాన్ని వేడుకగా జరిపించారు.

వైభవంగా పూర్ణాహుతి



ఆలయంలో పండిత పరిషత్ నిర్వహిస్తున్న అర్చకులు

రామతీర్థంలోని శ్రీ సీతారామస్వామి దేవస్థానంలో పూర్ణాహుతి కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు మంగళవారం అత్యంత వైభవంగా జరిపించారు.పుష్యమి నక్షత్రాన్ని పురస్కరించుకుని వేకువజామున స్వామికి ప్రాతఃకాలార్చన, బాలభోగం నిర్వహించిన తరువాత యాగశాలలో రామాయణంలోని పట్టాభిషేక సర్గ హవనం చేసి పూర్ణాహుతి నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకున్నారు.

పోలీస్‌శాఖ ప్రతిష్టను పెంచాలి

- నేర సమీక్ష సమావేశంలో ఎస్పీ వకుల్ జిందల్



భోగాపురం రూరల్ సీఐ రామకృష్ణను సత్కరిస్తున్న ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్: జిల్లాలో వివిధ స్టేషన్‌లలో పనిచేస్తున్న పోలీసు అధికారులతో ఎస్పీ వకుల్ జిందల్ జిల్లా పోలీసు కార్యాలయంలో మాసాంతర నేర సమీక్షా సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలతో మంచిగా ప్రవర్తించి, పోలీసుశాఖ ప్రతిష్ఠను పెంచాలని సూచించారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితులతో మర్యాదగా ప్రవర్తించాలని, వారు స్టేషన్‌కి ఏ కారణంతో వచ్చిందీ తెలుసుకుని వారు చెప్పే విషయాలను శ్రద్ధగా విని, పరిష్కార మార్గాలను చూపాలని, ఫిర్యాదులను స్వీకరించాలని చెప్పారు. విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా ప్రజలు ఎక్కువగా ఉండే ప్రాంతాలను సందర్శించాలని, రాత్రి పెట్రోలింగ్ సమయంలో విధిగా లాఠీ, విజిల్, టార్చిలైట్‌తో పాటు, వాహనానికి పోలీస్ సైరన్ ఉండాలన్నారు. రాత్రి సమయాల్లో అనుమానాస్పదంగా సంచరించే వ్యక్తుల వేలిముద్రలను తనిఖీ చేయాలని, పోలీసుస్టేషన్‌లు, సర్కిల్ కార్యాలయాలకు అందజేసిన ఎఫ్‌పీబీ చెక్ డివైజ్‌లను వినియోగించాలని అధికారులను ఆదేశించారు. గంజాయి, చోరీలు నియంత్రించడంలోనూ, లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులను డిస్పోజ్ చేయడంలోనూ, దర్యాప్తు కేసులను తగ్గించడంలోనూ, నిందితులకు న్యాయస్థానంలో శిక్షలు పడేవిధంగా చేయడంలోనూ, సీసీటీఎన్ఎస్‌లో కేసుల వివరాలను సకాలంలో అప్‌లోడ్ చేయడంలో ప్రతిభ కనబర్చిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ వకుల్ జిందల్ ప్రత్యేకంగా అభినందించి, ప్రశంసా పత్రాలను ప్రదానం చేశారు. సమావేశంలో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, విజయనగరం డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు, బొబ్బిలి డీఎస్పీ జి.భవ్యరెడ్డి, చీపురుపల్లి డీఎస్పీ ఎస్.రాఘవులు, డీటీసీ డీఎస్పీ ఎం.వీరకుమార్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ రఘురాం, న్యాయసలహాదారులు వై.పరశురాం, పలువురు సీఐలు, ఆర్‌ఐలు, వివిధ పోలీసుస్టేషన్‌ల ఎస్సైలు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నీటి కుంటలో పడి బాలుడి మృతి



మృతిచెందిన బాలుడు కుసుమంతరావు

రాజాం సిటీ: బాగా చదువుకుని ప్రయోజకుడై తమను ఆదుకుంటాడని అనుకున్న ఆ తల్లిదండ్రుల ఆశలు అడియాశలయ్యాయి. చదువులో చురుగ్గా ఉండడంతో ఇంకా బాగా చదవాలని రాజాంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో చేర్పించి చదివిస్తున్నారు. వారి ఆశలపై విధి కన్నెర్రజేయడంతో ఆ బాలుడు అకాల మరణం చెందాడు. ఈ ఘటనకు సంబంధించి స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండల పరిధి పెనుబాక గ్రామానికి చెందిన దువ్వారపు లక్ష్మణ, భవానీల చిన్న కుమారుడు కుసుమంతరావు (8) మంగళవారం సాయంత్రం గ్రామంలోని రాజాం–చీపురుపల్లి ప్రధాన రహదారి పక్కన ఓ నీటి కుంటలో పడి మృతిచెందాడు. ఎప్పటిలాగానే స్నేహితులతో కలిసి ఆడుకునేందుకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు నీటి కుంటలో కుసుమంతరావు పడిపోయిన విషయం గమనించిన తోటి పిల్లలు కుటుంబసభ్యులతోపాటు గ్రామస్తులకు సమాచారం అందించారు. వారు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని బాలుడిని కుంటలో నుంచి బయటకు తీసి సపర్యలు చేసి రాజాం ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలపడంతో భోరున విలపించారు. ఈ ఘటనకు సంబంధించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి

- నేడు జిల్లా వ్యాప్తంగా ప్రాజెక్ట్ ఆఫీసుల వద్ద అంగన్‌వాడీల ధర్నా



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు

పార్వతీపురంటౌన్: పేద గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలకు సేవలందిస్తున్న అంగన్వాడీ వర్కర్లకు కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని పార్వతీపురం మన్యం జిల్లా అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు పి.సరళ కుమారి, జి.జ్యోతిలక్ష్మి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం సుందరయ్య భవనంలో సమావేశం ఏర్పాటు చేసిన వారు మాట్లాడుతూ పెరుగుతున్న ధరలకు అనుగుణంగా 2019 నుంచి అంగన్వాడీలకు వేతనాలు పెరగలేదన్నారు. మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్పు చేస్తూ వెంటనే జీఓ ఇవ్వాలని డిమాండ్ చేశారు. హెల్పర్ ప్రమోషన్లకు నిర్దిష్టమైన గైడ్‌లైన్స్ రూపొందించి అమలు చేయాలని కోరారు. సంక్షేమ పథకాలు అంగన్వాడీలకు అమలు చేయాలని, సాధికార సర్వేలో ప్రభుత్వ ఉద్యోగులుగా అనే పదాన్ని తొలగించాలని డిమాండ్ చేశారు. సర్వీసులో ఉండి చనిపోయిన వారికి దహన సంస్కార ఖర్చులకు రూ.20,000 వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, సమ్మెకాలంలో చనిపోయిన వారికి కూడా ఇది అమలు చేయాలని కోరారు. ఈ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం ప్రాజెక్ట్ ఆఫీసుల వద్ద ధర్నా చేస్తున్నామని తెలిపారు. ధర్నాకు సంబంధించి కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పి.సరళ కుమారి గంట జ్యోతిలక్ష్మి, పార్వతీపురం ప్రాజెక్టు కార్యదర్శి గౌరీమణి, సెక్టార్ లీడర్స్ గౌరి, రాజేశ్వరి, భారతి, సీఐటీయూ నాయకురాలు ఇంద్ర పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో పలువురి మృతి



గూడ్స్ ఢీకొని మృతి చెందిన అప్పలరాజు

కొత్తవలస: మండలంలోని కొత్తవలస రైల్వే అండర్ బ్రిడ్జి సమీపంలో సోమవారం రాత్రి గూడ్స్ ఢీకొట్టడంతో కొత్తవలస గ్రామం కుమ్మరివీధికి చెందిన బొబ్బరి అప్పలరాజు(43) మృతి చెందాడు. అప్పలరాజు ఆటో డ్రైవర్‌గా పని చేస్తుంటాడు.ఈ క్రమంలో సోమవారం రాత్రి విధులు ముగించుకుని రైలుపట్టాలు దాటి ఇంటికి వెళ్లే సమయంలో ప్రమాదవశాత్తు రైలు ఢీకొట్టగా అక్కడికక్కడే మృతిచెందాడు. కాగా మంగళవారం ఉద యం గుర్తు తెలియని శవం పట్టాల సమీపంలో ఉందని జీఆర్‌పీ ఎస్సై బాలాజీరావుకు సమాచారం ఇవ్వగా ఆయన సిబ్బందితో ఘటనా స్థలానికి వచ్చి పరిశీలించి స్థానిక వ్యక్తేనని గుర్తించారు. ఈ మేరకు మృతుడి కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ట్రాక్టర్ బోల్తాపడి డ్రైవర్..



బోల్తాపడిన ట్రాక్టర్

సాలూరు రూరల్: మండలంలోని అన్నం రాజువలస పంచాయతీ పసుపువాని వలస గ్రామం వద్ద సోమవారం రాత్రి 12గంటల సమయంలో టేకు దుంగలతో ట్రాక్టర్ బోల్తా పడిన సంఘటనలో డ్రైవర్ మడక తిరుపతి(45) మృతిచెందాడు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం పసుపువానివలస గ్రామం నుంచి కటింగ్ చేసిన టేకు దుంగలు తెర్లాం మండలం సంగిరెడ్డి వలసకు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ తరలిస్తుండగా ప్రమాదవశాత్తు బోల్తాపడడంతో డ్రైవర్ అక్కడికక్కడే మృతిచెందినట్లు తెలిపారు. రూరల్ ఎస్సై నరసింహమూర్తి కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెట్టుపై నుంచి జారి పడి వ్యక్తి..

కొమరాడ: మండలంలోని దేవుకోన గ్రామానికి చెందిన కేలే నారాయణరావు(40) చెట్టుపై నుంచి జారిపడి మృతి చెందినట్లు ఎస్సై నీలకంఠం మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నారాయణరావు మేకల మేత కోసం ఇంటి ముందు ఉన్న చెట్టు ఎక్కి కొమ్మలు నరకుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు జారి పడిపోగా వెంటనే విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించపుటికే మృతిచెందినట్లు చెప్పారు. మృతుడికి భార్య, ఇద్దరు మగపిల్లలు ఉన్నారు. మృతుడి తల్లి అమ్మడమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై చెప్పారు.

బైక్ ఢీకొని వ్యక్తి..



మాధవరావు (ఫైల్)

రాజాం సిటీ: తన పాన్‌షాపు, ఇంటి ఆవరణలో భార్యతో మాట్లాడుతున్న ఓ వ్యక్తిని మృత్యువు బైక్ రూపంలో దూసుకొచ్చి బలిగొంది. మంగళవారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి సీఐ కె.అశోక్‌కుమార్ తెలిపిన వివరాలి లా ఉన్నాయి. మండల పరిధి ఒమ్మి పంచాయతీ కొత్తపేట వద్ద రోడ్డు పక్కన పాన్‌షాపు నిర్వహించుకుంటూ జీవనం సాగిస్తున్న బండారు మాధవరావు (55) ద్విచక్ర వాహనం ఢీకొని మృతిచెందాడు. ఎప్పటిలాగే మంగళవారం మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో వరండాలో కూర్చుని ఉన్నాడు. ఇంతలో రాజాం నుంచి తెర్లాం వైపు అతివేగంగా వస్తున్న ద్విచక్రవాహనం అదుపుతప్పి మాధవరావును ఢీకొంది. ఈ ఘటనలో మాధవరావు అక్కడికక్కడే మృతిచెందగా బైక్‌పై వస్తున్న వ్యక్తికి కూడా తీవ్రంగా గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు గాయపడిన వ్యక్తిని రాజాం సామాజిక అస్పత్రికి తరలించగా అక్కడినుంచి మెరుగైన చికిత్సకోసం శ్రీకాకుళం రిఫర్ చేశారు.

గుర్తు తెలియని వ్యక్తి..



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

విజయనగరం క్రైమ్: స్థానిక ఎగ్జిబిషన్ గ్రౌండ్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది పడి ఉన్నట్లు వన్‌టౌన్ సీఐ ఎస్.శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. మృతదేహం పక్కన పురుగు మందు డబ్బా లభించిందని చెప్పారు. పరిసర ప్రాంతాల్లో విచారణ చేపట్టామని, ఎటువంటి ఆధారాలు లభించలేదన్నారు. మృతదేహన్ని జిల్లా కేంద్రాస్పత్రికి తరలించామని, ఎవరికైనా ఆచూకీ తెలిస్తే వన్‌టౌన్ పోలీసులను సంప్రదించాలని కోరారు.

జ్యూయలరీ షాపు యజమాని ఇంట్లో చోరీని ఛేదించిన పోలీసులు

- 45 తులాల బంగారు ఆభరణాలు రికవరీ
- ముగ్గురు నిందితుల అరెస్ట్, పరారీలో ప్రధాన నిందితుడు



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ వకుల్ జిందల్ (వెనుక ముసుగులో నిందితులు)

విజయనగరం క్రైమ్: బొబ్బిలి పట్టణంలోని చిన్న బజారులో ఈ నెల ఒకటో తేదీన రాత్రి జరిగిన చోరీ కేసును ఛేదించి చోరీకి సహకరించిన ముగ్గురు నిందితులను అరెస్టు చేసి, చోరీ చేసిన 45 తులాల బంగారు వస్తువులను రికవరీ చేసినట్లు ఎస్పీ వకుల్ జిందల్ మంగళవారం తెలిపారు. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఎస్పీ వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి. బొబ్బిలి పట్టణానికి చెందిన జ్యూయలరీ షాపు యజమాని గ్రంధి రవికుమార్ ఈ నెల 2వ తేదీన తన ఇంటి తాళాన్ని గుర్తు తెలియని వ్యక్తులు పగలగొట్టి, ఇంట్లోకి ప్రవేశించి, బీరువాలో ఉన్న బంగారు వడ్డాణం, గాజులు, గొలుసులు, బ్రాస్‌లెట్లు, తదితర రూ.10.50 లక్షలు విలువ చేసే 45 తులాల బంగారు వస్తువులను చోరీ చేసినట్లు బొబ్బిలి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు విచారణలో పలు ఆధారాలను సేకరించి బొబ్బిలి మండలంలోని గున్నతోటవలసకు చెందిన పెంకి శ్రీనివాసరావు (ఎ2), పాత బొబ్బిలికి చెందిన బత్తుల సర్వేశ్వరరావు (ఎ3), ఎచ్చెర్ల మండలం ముద్దాడ గ్రామానికి చెందిన ముద్దాడ నరసింగరావు (ఎ4) అనే ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకుని విచారణ చేశారు. విచారణలో నిందితులు పేకాట, ఇతర చెడు వ్యసనాలకు అలవాటు పడినట్లు తెలిసింది. ఈ క్రమంలో పాత నేరస్తుడు సీతానగరం మండలం జోగింపేట గ్రామానికి చెందిన (ఎ1) పోలా భాస్కరరావుతో పరిచయం కాగా దొంగతనాలు చేసేందుకు ఇల్లు చూపిస్తే, చోరీ చేసిన వస్తువుల్లో వాటా ఇచ్చేందుకు వారి మధ్య ఒప్పందం కుదిరింది.

బంగారం అమ్మేందుకు వెళ్తుండగా పట్టివేత

నిందితులు పెంకి శ్రీనివాసరావు, బత్తుల సర్వేశ్వరరావులు పోలా భాస్కరరావుకు చోరీ చేసేందుకు ఫిర్యాదుదారు ఇంటిని చూపించగా, పలుమార్లు రెక్కీ నిర్వహించి, చివరకు ఫిబ్రవరి 1న అర్ధరాత్రి దాటిన తర్వాత పోలా భాస్కరరావు ఇంట్లోకి ప్రవేశించి, దొంగతనానికి పాల్పడ్డాడు. తరువాత తనకు పరిచయమున్న పాత నేరస్తుడు ముద్దాడ నరసింగరావు సహకారంతో బంగారు వస్తువుల్లో కొన్నింటిని కరిగించి, కడ్డీలుగా మార్చాడు. అనంతరం దొంగిలించిన వస్తువులను అమ్మేందుకు శ్రీనివాసరావు, బత్తుల సర్వేశ్వరరావు, నరసింగరావులు రాయగడ వెళ్లేందుకు ప్రయత్నిస్తుండగా పోలీసులకు పట్టుబడ్డారు. పరారీలో ఉన్న భాస్కరరావు గురించి గాలిస్తున్నామని, ప్రధాన నిందితుడిని కుడా త్వరలో పట్టుకుంటామని ఎస్పీ తెలిపారు. కేసులో క్రియాశీలకంగా పనిచేసిన బొబ్బిలి సీఐ కె.సతీష్‌కుమార్, ఎస్సై ఆర్.రమేష్‌కుమార్, ఏఎస్సై బీవీ.రమణ, కానిస్టేబుళ్లు ఎస్.రామారావు, యు. శ్రీరాములు, ఎస్.శ్రీహరి, అప్పారావులను ఎస్పీ అభినందించి, ప్రశంసాపత్రాలను అందజేశారు.

పది పరీక్షలకు పక్కా ఏర్పాట్లు

- మార్చి 17 నుంచి 31 వరకు షెడ్యూల్
- కాపీయింగ్ జరగకుండా చర్యలు తీసుకోవాలి
- జిల్లాలో 119 కేంద్రాలు.. అన్ని కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు
- కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్‌అంబేద్కర్

విజయనగరం అర్బన్: జిల్లాలో మార్చి 17 నుంచి 31వ తేదీ వరకు నిర్వహిస్తున్న రెగ్యుర్, ఓపెన్ స్కూల్స్ పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పక్కాగా చేస్తున్నామని కలెక్టర్ డాక్టర్ బీఆర్‌అంబేడ్కర్ తెలిపారు. ఈ మేరకు పది పరీక్షల ఏర్పాట్లపై కలెక్టర్ చాంబర్‌లో మంగళవారం సంబంధిత అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. రెగ్యులర్, ప్రైవేట్ కలిపి జిల్లాలో పది పరీక్షలు రాస్తున్న 23,765 మంది విద్యార్థుల కోసం 119 పరీక్ష కేంద్రాలను, ఓపెన్ స్కూల్స్ నుంచి రెగ్యులర్ 460 మంది, ప్రైవేట్‌గా 614 మంది విద్యార్థుల కోసం 27 కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. పరీక్షలు కట్టుదిట్టంగా ఎక్కడా కాపీ జరగకుండా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి కేంద్రానికి ఒక చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంట్ అధికారిని నియమించాలని, 7 ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు. అన్ని కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని, జిరాక్స్, నెట్ సెంటర్లను మూసి వేయాలని తెలిపారు. ప్రశ్నపత్రాలను నిల్వ ఉంచేందుకు గాను విజయనగరం, గజపతినగరం, చీపురుపల్లి, ఎస్.కోట పోలీస్‌స్టేషన్లలో కస్టోడియన్ సెంటర్లు ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాస్థాయిలో ఒక స్ట్రాంగ్ రూమ్ డీఆర్‌ఓ ఆధ్వర్యంలో ఉండాలని తెలిపారు. 9 రూట్‌లను ఏర్పాటు చేసి ఈఓపీఆర్‌డీ లేదా డిప్యూటీ తహసీల్దార్‌లను రూట్ ఆఫీసర్లుగా నియమించాలని చెప్పారు.

నిరంతర విద్యుత్ సరఫరా ఉండాలి

కేంద్రాల్లో నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలని విద్యుత్ అధికారులకు, తాగునీరు, పారిశుధ్యం ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్లు, డీపీఓను ఆదేశించారు. విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా పరీక్షల సమయంలో అవసరమైన బస్సులను నడపాలని ఆర్టీసీ అధికారులకు ఆదేశించారు. పరీక్షల పర్యవేక్షణకు మండలస్థాయిలో ఉన్న గెజిటెడ్ అధికారులను వేయాలని అన్ని కేంద్రాలను ప్రతిరోజూ సందర్శించి, ప్రశాంతంగా పరీక్షలు జరిగేలా ప్రతి ఒక్కరూ చూడాలని ఆదేశించారు. సమావేశంలో డీఆర్‌ఓ ఎస్.శ్రీనివాసమూర్తి, డీఈఓ మాణిక్యం నాయుడు, డీఎంహెచ్‌ఓ డాక్టర్ జీవనరాణి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

3 లక్షల దోమల తెరల పంపిణీకి ప్రతిపాదనలు

- డీఎంహెచ్‌ఓ భాస్కరరావు
- దోనుబాయి, మర్రిపాడు పీహెచ్‌సీల సందర్శన



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో భాస్కరరావు

సీతంపేట: పార్వతీపురం మన్యం జిల్లాలో 3లక్షల దోమతెరల పంపిణీకి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించినట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి ఎస్.భాస్కరరావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన మండలంలోని దోనుబాయి, మర్రిపాడు పీహెచ్‌సీలను సందర్శించారు. ఓపీ వివరాలు, రికార్డులు పరిశీలించి రోగులతో మాట్లాడారు. మందులన్నీ అందుబాటులో ఉన్నాయా లేదా అనేది అడిగి తెలుసుకున్నారు. వైద్యసిబ్బందికి పలు సూచనలిచ్చారు. పీహెచ్‌సీల పెర్‌ఫార్మెన్స్ బాగా ఉండాలని కోరారు. సూపర్‌వైజర్ల పనితీరు మెరుగుపడాలని సూచించారు. అనంతరం స్థానిక వైటీసీలోని గర్భిణుల వసతిగృహాన్ని తనిఖీ చేసి గర్భిణులతో మాట్లాడారు. వైద్యాధికారులతో అక్కడే సమావేశం ఏర్పాటుచేశారు. బర్త్‌వెయిటింగ్ రూమ్‌లకు గర్భిణులను వారం రోజుల ముందు చేర్చాలని చెప్పారు. రానున్న ఎపిడమిక్ సీజన్‌లో వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మలేరియా వ్యాప్తి చెందకుండా తగు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. దోమల నివారణ మందు స్ప్రేయింగ్ గ్రామాల్లో తూతూ మంత్రంగా చేయవద్దని, దండోరా వేయాలని చెప్పారు. గతంలో 90 రోజుల్లో రెండు సార్లు పిచికారీ చేసేవారమని, ఇప్పుడు మూడు రౌండ్లు చేయనున్నట్లు తెలిపారు. వసతిగృహాల్లో కూడా స్ప్రేయింగ్ చేయాలన్నారు. జిల్లాలో 12 మంది వైద్యాధికారులు పీజీ కోర్సులకు వెళ్లనుండడంతో వారి స్థానాల్లో కొత్త వారిని రిక్రూట్ చేయడానికి చేయడానికి కలెక్టర్‌కు ప్రతిపాదించామన్నారు. కార్యక్రమంలో కుష్ఠువ్యాధి నివారణాధికారి వినోద్‌కుమార్, డిప్యూటీడీఎంహెచ్‌వో విజయపార్వతి, వైద్యాధికారులు సాయిచరణ్, భానుప్రతాప్, చాందిని, సత్యవేణి తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి అర్హతతో పోస్టల్‌లో ఉద్యోగాలు

పోస్టుల వివరాలు

పోస్టు	పార్వతీపురం మన్యం జిల్లా	విజయనగరం జిలా	శ్రీకాకుళం జిల్లా	మొత్తం
బీపీఎం	16	6	0	22
ఏబీపీఎం	8	3	2	13
డాక్‌సేవక్	3	1	0	4
మొత్తం	27	10	2	39



పోస్టల్ సూపరింటెండెంట్ బాబూరావు

పార్వతీపురం టౌన్: పదో తరగతి అర్హతతో పోస్టల్‌లో ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల చేస్తున్నట్లు పార్వతీపురం పోస్టల్ సూపరింటెండెంట్ బాబూరావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పార్వతీపురం డివిజన్ పరిధిలో మొత్తం 39 ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల చేశారని అందులో పార్వతీపురం జిల్లా పరిధిలో 27, విజయనగరం జిల్లా పరిధిలో 10, శ్రీకాకుళం జిల్లా పరిధిలో 2 పోస్టులు విడుదల చేసినట్లు తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు మెరిట్‌పై ఆన్‌లైన్‌లో ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఈ నెల 10 నుంచి మార్చి 3 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులో తప్పులుంటే మార్చి 6 నుంచి 8 వరకు ఎడిట్ ఆప్షన్ ఉంటుందని ఆ సమయంలో సరి చేసుకోవచ్చునన్నారు.